రెప్పల చప్పుడు

(నానీలు)



సోమేపల్లి వెంకటసుబ్బయ్య

రెప్పల చప్పుడు

నానీలు

సోమేపల్లి వెంకట సుబ్బయ్య

సోమేపల్లి వెంకట సుబ్బయ్య

రెప్పల చప్పుడు

నానీలు

By

సోమేపల్లి వెంకట సుబ్బయ్య

© Copyrights Reserved

తొలిముద్రణ: ఆగస్ట్ - 2004
కాపీలు: 1,000

ముఖ చిత్రం
ఉదయ్

Rs. 25-00

For Copies:

సోమేపల్లి వెంకట సుబ్బయ్య
C/o. క్రిసెంట్ పబ్లికేషన్స్
29-25-43A, వేమూరివారి వీధి
సూర్యారావు పేట
విజయవాడ - 520 002

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, బ్యాంక్ వీధి
విజ్ఞాన్ భవన్, హైదరాబాద్-3

అన్ని బ్రాంచీలు

మరియు

చలపాక ప్రకాష్
P.A. మార్కెట్, షాప్ నెం. 61
P.B. No. 5
జెండా వీధి, విజయవాడ-1
సెల్: 92464-71776

Published by:
CRESCENT PUBLICATIONS
Vijayawada - 520 002.



నీ ప్రేమ తీపి జ్ఞాపకం
నీ నడత స్ఫూర్తిదాయకం

చిన్నాన్న సోమేపల్లి వెంకటేశ్వర్లు
నిరంతర స్మృతికి ...

కృతజ్ఞతలు

డా॥ సినారె • డా॥ ఎన్. గోపి • డా॥ నాగభైరవ
డా॥ అద్దేపల్లి • డా॥ ద్వా.నా.శాస్త్రి • రసరాజు • ఎస్.ఆర్. భల్లం
ఇత్యాది ప్రముఖ కవులకూ

'లోయలో మనిషి'ని అంకితం స్వీకరించిన జననీజనకులు
సోమేపల్లి నాగరత్నం, హనుమంతరావు

'తొలకరి చినుకులు' అక్కున చేర్చుకొన్న అర్ధాంగి
విజయలక్ష్మి

'చల్లకవ్వం' కళ్ళ కద్దుకున్న "ఆత్మీయబంధువు"
తోటకూర వెంకటనారాయణ

కొప్పర్తి, డాక్టర్ వి. వెంకట్రాజు • బీరం సుందరరావు
సీనియర్ పాత్రికేయులు **యద్దనపూడి సూర్యనారాయణమూర్తి**
ఎక్స్‌రే **కొల్లూరి • చలపాక ప్రకాష్ • మాకినీడి సూర్యభాస్కర్**
తలతోటి పృథ్వీరాజ్ • విద్యావేత్త **జంగాగోపాల్ • గట్టెం మాణిక్యాలరావు**
జి.ఎల్.ఎన్. మూర్తి • నేతల ప్రతాప్‌కుమార్
తోటకూర వేంకటరాయలు • నాగసూరి వేణుగోపాల్
వి.ఉదయలక్ష్మి (ప్రజాశక్తి)

ఇత్యాది సహృదయులకు

ఈ పుస్తకాన్ని ముచ్చటగా ముద్రించిన
'కంప్యూటర్ విజ్ఞానం' ఎడిటర్ **యం. రామారావు గారికి**

ముఖచిత్రాన్ని అందంగా తీర్చిదిద్దిన
ఆర్టిస్ట్ ఉదయ్ కి

నానీలను ప్రచురించిన వివిధ పత్రికాధిపతులకీ

కృతజ్ఞతలు

చిన్నారులు శ్రీ వశిష్ఠకి, శ్రీ విశ్వనాథవిరించికీ అభిమాన పూర్వక ఆశీస్సులు.

Prof. N. Gopi
Dept. of Telugu
Osmania University, Hyd - 7.
Former Vice-Chancellor, PSTU

Ph: College: 4657813
Dept.: 7682294
Resi.: 7037585

మలి చినుకులు

ఇది సోమేపల్లి వెంకటసుబ్బయ్యగారి నానీల రెండో సంపుటి. మొదటి 'తొలకరి చినుకులు' ఇది వరకే సహృదయుల గుండెల్ని తడిపేశాయి. మరి రెండోది ఎందుకు? ఆర్తి తీరక. సృజనాత్మక రచయితకు సంతృప్తి మరణం లాంటిది. సోమేపల్లి నిత్యచైతన్యంగా ఉండదలుచుకున్నారు. నానీల సంపుటులు నేనూ రెండు వేశాను. ఆ రకంగా కూడా మా ఇద్దరికీ పోలిక ఏర్పడింది.

సోమేపల్లి గతంలో 'లోయలో మనిషి, చల్లకవ్వం' అనే వచన కవితా సంపుటులు వెలువరించారు. పెద్ద కవితలు రాయడంలో తన సత్తా నిరూపించుకున్నారు. సామాజికత, ఆర్ద్రత సోమేపల్లి సొత్తు.

ఇప్పుడీ 'రెప్పల చప్పుడు' నానీల్లో మరింత పరిణతిని ప్రదర్శించారు. చిన్న కవితలు రాయడం చిన్న పనేం కాదు. తీవ్రమైన ఉద్వేగం, భావావేశం లేకపోతే బలహీనత బయటపడుతుంది. పెద్ద కవితల్లో శక్తిహీనతను దైర్ఘ్యంలో కొంత దాచుకోవచ్చు. నానీల్లో అలాకాదు. నానీలు అల్పాక్షరాల్లో అనల్పార్థ రచనకు నిదర్శనాలు. వీటిలో చెప్పిన దాని కంటే చెప్పందే ఎక్కువ ఉంటుంది.

'కాశ్మీర్ ఆపిల్
కొరికి చూద్దును కదా
గడ్డకట్టిన
నెత్తురు'

యాభై సంవత్సరాల కాశ్మీర్ అశాంతిని విప్పి చెప్పిన నానీ ఇది. దీని గురించి ఓ గ్రంథమే రాయొచ్చు.

'మంటల నార్పేస్తుంది
చిచ్చునూ రగిలిస్తుంది
ఇదే
ఈనాటి 'నీటి' నిజం'

నీటి రాజకీయాలను గురించి ఒక్క ముక్కలో చెప్పటమంటే ఇదే. రేపటి యుద్ధాలన్నీ నీటి యుద్ధాలే. ఒకవైపు వర్షం లేదు. అసెంబ్లీలో కురిసే రాజకీయ వర్షం బురదకన్నా హీనం. వర్షాభావాన్ని గురించి సోమేపల్లి అంటారూ...

'చినుకు కోసం
మొహం ముడిచింది
ఎండకుమాడిన
నల్లని గొడుగు'

'నల్లని గొడుగు'లో ఉంది ధ్వని. అలాగే చక్కటి ఊహకు ఈ కింది నానీ తార్కాణం.

పచ్చని చెట్లు
తెల్ల బడ్డాయా?
ఓహో తెలిసింది
కొమ్మ కొమ్మకూ కొంగలు.

నానీల్లో సామాజిక వ్యాఖ్యానానికి ఎంతో వీలుంది.

గొంతు
నిజాలు మాట్లాడుతుందా
అయితే
అది ఖచ్చితంగా కాలుతున్న పేగు

అంటారు సోమేపల్లి. వస్తు వైవిధ్యం, కవితా శక్తిలేని నానీ తేలిపోతుంది. సోమేపల్లి గట్టి గింజల్లాంటి నానీలు రాశారు. ఇది చూడండి...

"నదీ పుస్తకానికి
అలలే పుటలు
కిరణాలే
అక్షరాలు"

సోమేపల్లి అక్షరాలు కూడా కిరణాలే. ఆ కిరణాలకు రెండోసారి స్వాగతం.

గోపి

రెప్పల చప్పుడు

కదులుతున్న
కాలనీలా...
రాత్రిపూట నడిచే
రైలుబండి

కాశ్మీర్ ఆపిల్
కొరికి చూద్దును గదా
గడ్డ కట్టిన
నెత్తురు

ఆంధ్రా కన్నా
అమెరికా గొప్పా...?
ఒక్కరోజు -
అక్కడ కరెంటు పోతే...

మంటల నార్పేస్తుంది
చిచ్చునూ రగిలిస్తుంది
ఇదే -
ఈనాటి "నీటి" నిజం

మెరిసే కళ్ళు -
పెళ్ళి కాంతిలో...
చీకట్లో
తగ్గిన మిరుమిట్లు...!

సంక్రాంతీ కాదు
క్రిస్మస్ కాదు
అన్నం దొరికిన్నాడే
నిజమైన పండగ

పట్నాల్లోనూ
ఇంజబీర్లున్నాయి
పిచ్చుక గూడు
ముచ్చట చూడు

జొన్నరొట్టె
నులక కుర్చీ
నగరం స్టార్ హోటల్లో
ఈనాటి స్పెషల్స్

నాగలీ, గొర్రూ
జడ్డిగమూ..
ఇవన్నీ పెట్టాల్సిందే -
ఇక మ్యూజియంలో...

పొద్దుతిరుగుడు పువ్వది
అభ్యుదయ వాదమే
ఎటు వెలుగో
అటే దృష్టి...

వాన కురిసినా
వంతెన గొంతు
తడారిపోయింది
ఇక వసంతమా...!?!

రంగురంగుల
"కోలా" హాలం...!
గొంతు దిగిందా
రోగాల కోలాహలం...!!

ప్రయాణం -
నీ ఒంటికి పడదా
అదేమిటి
అదే జీవిత చక్రం!

సెంటర్లో గుడీ
అందులో హుండీ
పెట్టుబడి లేని
వ్యాపారం అంటే ఇదే!

చినుకు కోసం
మొహం ముడిచింది
ఎండకు మాడిన
నల్లని గొడుగు

పేగులు

వెళ్ళకొచ్చిన శవంలా

వేళ్ళతో సహా

పెకలించబడ్డది చెట్టు

చెట్లూ చేమలూ

కొండా కోనలూ

ఇవేగా

అవని పుత్రులంటే...!

పచ్చని చెట్లు

తెల్లబడ్డాయా?

ఓహో తెలిసింది...

కొమ్మ కొమ్మకూ కొంగలు

నగరం పంజరంలో
రెపరెపలాడే తనువు
పల్లె పొత్తిళ్ళలో
మనసు

అమ్మయ్య
ఎన్నాళ్లికొచ్చింది
వాన ఎలా వుంటుందో
మర్చేపోయాం...!

క్రికెట్ ఫీవర్
దేశమంతా...
మందు కనుక్కోలేని
మాయదారి జబ్బు

అత్యాశకు
అతడే ఒక చిరునామా
వంద పడవలూ
ఒకే పాదం

చమురు క్షేత్రంపై
నెత్తురు మరకా...?
కొన్నాళ్ళకు
అదే నూనె కాబోలు!

బెలూన్‌లా
ఎగిరే పసి వయసా
అవును
ఆధారం ఆకలిబరువే

దుబారా చేస్తున్నావా
జాగ్రత్త -
మంచినీళ్ళు
మనీపేపర్లు కాదుగా

రేపటి ఆకల్నీ
ఇవ్వాళే దర్శిస్తావా
బ్రహ్మాజెముడ్ని
ఆదర్శంగా తీసుకో

గొంతు
పచ్చినిజాలు మాట్లాడుతుందా..?
అయితే
ఖచ్చితంగా కాలుతున్న పేగే

దేవుడు

దేహానికి గుర్తొచ్చాడా

పాపం

కష్టమేదో వచ్చుంటుంది.

ఆశలూ ఆశయాలూ

సమాంతర రేఖల్లాగే

పట్టాల మీద

రైలుతో పాటే

మోరెత్తి

అరుస్తోంది

కబేళాలో గొడ్డు

ఏ సిద్ధార్థుడి కోసమో...?

ఏదో కోల్పోయిన
గుబులు
గుర్తొచ్చింది
సెల్‌ఫోన్ మర్చిపోయా...!

సరిచెయ్యడమే...
ఎత్తు పల్లాల్ని....
"తాపీ"గా
గోడనైనా గోతినైనా

సముద్రం తలపై
అలల కదలిక
తీరానికి మాత్రం
శీర్షాభిషేకం

సకల

వ్యవహారమే కాదు

సకల జన సమాహారం

బస్‌స్టాండ్

చర్మం వలిచి

చెప్పులు కుట్టిస్తాడట

ఎవరి చర్మమో

సస్పెన్స్...!?!

తారలు

నింగి నుంచి నేలకి...

కరెంట్ వడ్డాణం-

నగరం నడుముకి...

శరీరం నిండా
తియ్యదనమే
ఊరిస్తున్న
అన్నీ వున్న విస్తరి

పుష్కరమంటే
పన్నెండేళ్ళు...
పేగు నిండితేనే
అది పుష్కలం

పట్టాలపై రైలు పరుగు
పల్లెటూళ్ళో
తల్లి పేగులో
గుబులు గుబులు

కొండ మీంచి చూస్తే
విసిరేసినట్టు ఇళ్ళు
నదికి ఎప్పుడు
వేవిళ్ళు...!?!

ఊరిలో
నీటికి కటకట
మరి చుట్టూ
చేపల చెరువులే

అదురు
ఆదివారమంటేనే ...
జీవాల
సామూహిక చావు ముహూర్తాలు

ఆనకట్టా ఆయకట్టూ
సిద్ధం
నీళ్ళ కోసం
పైరు నోట్లో శని

కరెంటు చితిపై
మొండికేసిన శవం
బిల్లు లేమైనా
బకాయేమో...!

నదీ పుస్తకానికి
అలలే పుటలు
కిరణాలే
అక్షరాలు

క్రీడాస్థలం కోసం
వెతుకులాటా...!?
కంప్యూటర్
కడుపే మైదానం

మంత్రంతో
మాయం చేస్తానంటాడు
మరి,
శరీరం నిండా రోగాలే

యజ్ఞంలో
ఆహుతయ్యేది
సమిధలే కాదు
తీరని సమస్యలు

ప్రతిబింబం కోసం
ఆత్రమెందుకు...?
శిలాఫలకం
మనో ముకురం కాదుగా...

ఆశ
మట్టివాసన కోసం
పీల్చండి
నగరం నడిబొడ్డులో కుండీ

ఆవిష్కరిస్తున్నవి
పుస్తకాలు కాదు
అవి
మస్తకాలు కూడా

మనిషి కోసమే కాదు
నిరీక్షణ
పరిమళించే
పరిచయం కోసం

పసికళ్ళనూ పెనవేసింది
నిద్ర
దూరాభారంగా
వయసుతో పాటు

పాట కోసం నిరీక్షణ
అందుకే -
మామిడి చెట్టును అల్లుకున్నా
తీగనై

ఎదుగుదల -
ఎవరికైనా...
అందనంత ఎత్తుకి
సలహాల పెట్టె

అతడూ
ఓ ఆదర్శమే
ఏం చెయ్యకూడదో...
చూసి నేర్చుకోవచ్చు

ముచ్చట్లకే కాదు
రచ్చబండ
అనుభవ పాఠాలు
సానబట్టే వేదిక

కళ్ళను

ఆడిపోసుకోవడం దేనికి

మనసెలా చెబితే

అలా...

వెండితెర మీద

జీవిస్తాడు

జీవితంలో మాత్రం

నటిస్తాడు

అన్నం ముద్దా

చిన్నారి ముద్దూ

ఆనందానికి

ఆకాశమే హద్దు

పంజరంలోనే
పడి వుంటావ్
ఎగరడం నేర్చుకునేది
ఎలాగో...!

ఆకలితో
అలమటిస్తున్నది
పోస్ట్‌బాక్స్ -
సైబర్ జ్వరం...!

కోనసీమ
పచ్చని హరివిల్లు
ఎర్ర నల్లి
కొబ్బరి గుండెకి పెద్ద చిల్లు

పొట్ట చేతబట్టుకుని
పొరుగూళ్ళకు...
బతుకులు చిట్లించింది
తాలు విత్తే...

ఆమె వయసెపుడూ
ఇరవై రెండే
తిరగబడినా
తిరుగుండదు

చీకటినే
చీల్చగలుగుతున్నాడు
అతడు
కళారవి కాబట్టే...

కులాలు
మతాలూ వున్నాయి
ఊరు మాత్రం
ఉమ్మడి కుటుంబమే

మనోగవాక్షం
తెరిచే వుంది
అన్ని దృశ్యాలకూ
సుస్వాగతం

కాడిగట్టూ
నీటి బోదీ
సరిహద్దు రేఖలు కాదు
ఆత్మీయతా స్పర్శలు

అతడేమో
మిస్టర్ గమ్
ఇతడేమో ఫెవికాల్
ఎవరైనా లాగండిక

ఆక్సిజన్
కర్మాగారాలన్నీ
ఆవిరై పోయాయ్
రోడ్ల విస్తరణ...!?

పసి మనసు
పరమ స్వచ్ఛం
బోసి నవ్వుల
పువ్వుల గుచ్ఛం

నోరెండిన
చెరువులూ కాలవలూ
నీరెండిన
రైతు కళ్ళ నెర్రెలు

కుట్టేవాడి కంటే
చెప్పులే నయం
అప్పుడప్పుడైనా
ముస్తాబవుతాయి

అమ్మా నాన్నలు
మమ్మీ డాడీలు
బడి కొష్టమేమో
భవితవ్యపు భవంతి

నీ అడుగుజాడల్లో

నడవాలా...?

నేలమీద నడవడం

నేర్చుకో ముందు...!

చెరోదారి

కాసుల ఆశలో...

కకావికలైంది ప్రేమ

క్రాస్ రోడ్స్‌లో

"గంటల" బండికి

పనిబడిందా...

బాబోయ్

బతుకు బండి పల్టీయే

నడిచీ నడిచీ
కాళ్ళరిగాక -
కడవ నింపింది
కన్నీటి చెలమ

పలుకుబడికి
పల్లకీమోత
పాడి పశువుకేగా
పచ్చిమేత

కమ్మరి కొలిమి
ఆరింది గానీ
గుండె కొలిమి మాత్రం
చల్లారలేదు

ఇంటి నాయికకి
వొళ్ళెక్కడుందో...
తెరమీద తారకి
గుడ్డెక్కడుందో...!

పొలం
ఒకప్పుడు పాడి కుండే...
"కళ్ళం" కళ తప్పి
గాదె వొట్టి పోయిందంతే

కులానికో నుయ్యి
గోత్రానికో గొయ్యి
గ్రామదేహం నిండా
రాళ్ల వెయ్యి

ఆ నీళ్ళు
తాగితే అంతే...
కాళ్ళూ చేతులే కాదు
బతుకూ వంకరే

రేయింబవలు
రైలు ప్రయాణం
భారతదర్శనం అంటే
ఇదేనా!

వాళ్ళిద్దరూ
మొగుడూ పెళ్ళాలే
సర్కారీ సొమ్ము కోసం
విడిపోతున్నారంతే...

నీళ్ళు నీళ్ళు నీళ్ళు
ఎటు చూసినా నీళ్ళు
ఇళ్ళలో నీళ్ళు
కళ్ళలో కూడా

అక్షరాలా
బాల కార్మికుడే
అనుభవం
వృద్ధ సైనికుడంత

చదరంగపు గడుల్లా
గట్ల మధ్య చేలు
సేద్యం కూడా
జూదమే

అచ్చమైన
తెలుగువాడివేలే
అప్పుడప్పుడన్నా
తెలుగు మాట్లాడు మరి...

"క్యూ" కట్టి గాని
కదలవు
చిట్టి చీమల నుంచి
కట్టుబాటు నేర్చుకో

మరుగుజ్జును
"మహా" మనిషిని చేస్తుంది
నల్ల డబ్బుది
ఎంత మహిమ!

పుట్టకముందే
ఏ బిడ్డో కనుక్కుంటావా...!
దవాఖానా
దాగుడుమూతలాడితే...?

మనిషికే కాదు
వూరు గుండెకీ బైపాస్
చుట్టు తిరిగితే
మరో రోడ్డు

నగరం
ఎక్కడుందనా
చిమ్నీల పొగ సర్దుకోనీ
చూద్దువు గాని...

అవకాశవాదానికి

పరాకాష్ట

స్వామికి మొక్కులు

షరతులతో...

అద్దమేమీ

మసకబారలేదు

చూపించిందంతే

అసలు రూపం

పుష్కరాలకు సిద్ధం

మరపడవలూ ఈతగాళ్ళూ

మరి

పెళ్ళో...!?

పైపైకి పాకుతోంది
ఆకులూ అలములు కాదు
కొండపైకి
ఇళ్ళు!!

బుడిబుడి పదాలలో భూగోళమంత భావం

ఎవరో ఒకరు, ఎపుడో అపుడు, ఏదో ఒక ప్రయోగం అంటూ చేయడం అవసరమే. ప్రయోగాలతోనే కదా ప్రయోజనాలు చేకూరేవి. చెప్పొచ్చేదేమిటంటే ఏ రంగంలోనైనా ప్రయోగం అనేది అభిలషణీయం. సాహితీ రంగంలో ఎవరెవరో ఎన్నో ప్రయోగాలు చేసి అన్నో ఇన్నో ప్రయోజనాలు సాధించిన సంగతి మనకి తెలుసు. ఆచార్య ఎన్. గోపి పేరు ఇక్కడ ప్రస్తావనార్హం. ఎందుచేతంటే 'నానీల' పేరిట ఆయనొక ప్రయోగం చేసి కొత్త కవితా ప్రక్రియకు శ్రీకారం చుట్టారు కాబట్టి... ఇప్పుడా నానీల ఉద్యమం ఆంధ్ర దేశంలో ఊపందుకోబోతోంది కాబట్టి...

'నానీ' అంటే చిట్టి పొట్టి మాటల చిత్రంలో అనుభూతుల్ని, ఆప్యాయతల్ని అమర్చుకోవడం, బుడిబుడి పదాల్లో భూగోళమంత భావాన్ని ఇముడ్చుకోవడం. కవి, విమర్శకుడు ఎస్.ఆర్. భల్లం 'నానీ'కి చెప్పిన అర్థమిది. నానీల నాన్నారు గోపీ సార్‌కి ఈయనే తొలి వారసుడు. పచ్చని పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఎమ్మార్వో ఉద్యోగం చేస్తున్న సోమేపల్లి వెంకటసుబ్బయ్య సర్కారీ కొలువుతో సరిపెట్టుకోకుండా ఇదిగో ఈ నానీల వెంటపడ్డాడు. ఆ క్రమంలో వెలువరించిందే 'తొలకరి చినుకులు'.

'తొలకరి చినుకులు' సోమేపల్లి వారికి తొలి ప్రయత్నమేమీ కాదు. అంతకుముందే ఆయన 'లోయలో మనిషి' అనే కవితా సంకలనాన్ని తెచ్చారు. 'నానీ'ల మాధుర్యాన్ని 'భల్లం' నుంచి కొద్దిగా రుచి చూసి అనుభూతించి చిరుకవితా యజ్ఞానికి ఉపక్రమించారుట. అదే తొలకరి చినుకులు. ఇదొక నూరు నానీల సమాహారం. మనసులోని భావాలను యథాతథంగా కాగితంపై పెడితే అది వేనవేల పదాల అల్లికై పాకుతూ పోతుంది. అలా అలా సాగిపోయే ఈ కవితా ప్రవంతిని 'అదుపు'లో పెట్టడం కవికి నిజంగా కష్టసాధ్యమే. నాలుగంటే నాలుగే లైన్ల 'నానీల'ను చూస్తే కవి కష్టమేమిటో తెలుస్తుంది. అనంతమైన భావాలను చిన్న చిన్న పదాలలో ఇరికించి చెప్పడం గొప్ప విషయమనిపిస్తుంది. అందుచేత 'తొలకరి చినుకులు' ఆసాంతం చదివాక సోమేపల్లి వారిని అభినందించాలనితోస్తుంది. పేరులోనైతే చినుకులు అని ఉంది కానీ నిజానికి ఈ సంకలనంలోకి పోతున్న కొద్దీ జడివానలో తడిసి ముద్దవుతాం కూడా. పల్లెతనం పచ్చదనం, తల్లితనం చల్లదనం ప్రతీ నానీలో పరామర్శిస్తుంది. కావాలంటే ఈ చిరుకవితను చూడండి...

పల్లెతనం
చల్లని చద్ది బువ్వ
పట్నవాసం
వేడి వేడి ఫాస్ట్ ఫుడ్

– నాలుగు లైన్లలో నవనాగరికతను చెంపపెట్టుగా చెప్పిన సెటైర్ బావుంది

పట్నంతా
కళ్ళు చేసుకోవాలి
కాన్వెంట్ రిక్షాలో
కదులుతుంది బాల్యం

– చిట్టిపొట్టి అడుగుల చిన్నారి బుడతలు బంగారు బాల్యం రిక్షాలో బందీగా మారిన వైనాన్ని కవి గొప్పగా చెప్పాడు.

బిందువూ బిందువూ
సింధువైనట్లు
ఊరి జనమంతా
బంధువులే...

– విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని భలే నొక్కి చెప్పాడు కవి.

ఎంత అందంగా ఉంది
ఈ ప్రపంచం...
పెట్టుకుంది
రంగుటద్దాలు మరి...!

– ఆ అద్దాలు వదిలి చూస్తే అంతా అందవికారమే కదా సుమా!

బుల్లి తెరేనని
సరిపెట్టుకోకు...!
బుర్రలు
చెడగొడుతుంది...!!

– బుల్లి తెరకు అల్లుకుపోయిన జనానికి కవి హెచ్చరిక ఇది.

చిన్నప్పటి
ఉత్తుత్తి బువ్వలాటలు
పెద్దయ్యాక
నిజమై పోయాయేమిటి...?

– ఆకలి ప్రపంచంపై కవి విసిరిన చమత్కారం బాగుంది కదా!

ఇంకా ఈ సంకలనంలో...

గోరు ముద్దల
గొంతుకకి
అమ్మచేతి చలువ
ఎపుడూ గురుతే...

* * *

అదేం చిత్రమో
పట్నమొచ్చి
చూస్తేకాని
పల్లె సౌందర్యం తెలియులే...!

* * *

చిన్న చేపల్ని
పెద్ద చేపలు,
సమాన ధర్మంగా
పల్లెల్ని పట్నాలు...

★ ★ ★

అరే...
ఇక్కడ ఊళ్ళుండాలే
ఏమీ...
గోదారికి కోపం వచ్చిందా...!

★ ★ ★

ఎదుగుదల
ఎంతదాకా?
ఊపిరి
ఉత్సాహంతో ఊరేగే దాకా...!

ఇలా చాలా ఉన్నాయి. అన్నీ చదివాక అనుకుంటాం. అర్ధంకాని అన్నన్ని కవితా పంక్తుల్ని చదివేకంటే ఇలా ఈ చిరు చిరు కవితల్లో... అదే నానీల్లో విహరించడం రిలీఫ్‌గా ఉందని...

దేశరాజు శ్రీనివాస్,
సుప్రభాతం వీక్లీ

పల్లెబాల్యం పరిమళించిన తొలకరి చినుకులు

సాధారణంగా బాల్యం తియ్యని మధురానుభూతి. అందులోనూ పల్లెబాల్యం మరింత మధురాను భూతి. పచ్చని సిరులు ప్రశాంత ప్రకృతి మాత నివసించేది పల్లెలోనే. అరమరికలు లేని బోళాతనం, అప్యాయతల జీవనవిధానం కనిపించేది పల్లెలోనే. అలాంటి పల్లెలో పుట్టడం, బాల్యాన్ని గడపడం అదృష్టం అయితే, కవి ఆ అనుభూతుల్ని కవిత్వీకరించి సాహితీ ప్రియులకు అందించడం న్యాయం. సరిగ్గా అదే పని చేశారు 'లోయలో మనిషి' కవితాసంపుటి ద్వారా మంచి కవిగా నిరూపించుకున్న సోమేపల్లి వెంకట సుబ్బయ్య. ఆయన బాల్యానుభూతుల్ని, పల్లె సంస్కృతిని ఇటీవల కురిపించిన "తొలకరి చినుకులు"లో నానీలుగా నాటారు.

"ఒకానొక వర్షాకాలంలో మట్టిని చీల్చుకుని వచ్చిన మృత్తికా సౌరభంలా వెలువడ్డాయి నానీలు" అంటారు నానీల రూపశిల్పి, తెలుగు యూనివర్శిటీ వైస్ చాన్సలర్, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా॥ ఎన్. గోపీ. ఆ మృత్తికా సౌరభం, నానీల పరిమళం రెండూ తెలిసినవాడు సోమేపల్లి.

ప్రకాశం జిల్లా గన్నవరం అనే గ్రామంలో పల్లె పరిమళాలను ఆస్వాదించి ఉద్యోగం రీత్యా (విమ్మార్శో) పట్టణాలకు తిరుగుతున్న సోమేపల్లికి "పట్నం వచ్చి చూస్తేగాని పల్లె సౌందర్యం తెలియలేదట" అయితే పల్లెకి, పట్నానికీ తేడా మాత్రం ఇప్పుడు స్పష్టంగా తెలిసినట్లుంది. అందుకే

"పల్లెతనం
చల్లని చద్దిబువ్వ
పట్నవాసం
వేడివేడి ఫాస్ట్‌ఫుడ్"

అంటాడు.

"చల్లకుండలో
కవ్వం తందనాలు
బుడత నోట్లో
వెన్న బుడగలు"

"నేల తల్లికి
అవయవాలు
చెట్లూ చేమలూ
వాగూ వంకలూ"

లాంటి మనోహరమైన పోలికలతో పల్లె పరిమళాన్ని మనముందు పరుస్తాడు

సోమేపల్లికి అవకాశం దొరికినప్పుడల్లా రెక్కలు కట్టుకొని బాల్యంలోకి ఎగిరిపోతూ ఉంటాడు.

"బాధల గాథలు
మరవాలంటే
బంగరు బాల్యానికి
బందీ అవాల్సిందే" అంటాడు.

అలా బందీ అయ్యి

"వళ్ళంతా
కళ్ళు చేసుకోవాలి
కాన్వెంట్ రిక్షాలో
కదులుతుంది బాల్యం"

అని బాల్యాన్ని నెమరు వేసుకుంటాడు.

ఇంతలోనే

"చిన్నప్పటి
ఉత్తుత్తి బువ్వలాటలు
పెద్దయ్యాక
నిజమై పోయాయేమిటి"

అని ఉలిక్కిపడతాడు. పల్లెను, బాల్యాన్ని తలచుకుంటూ కూర్చోక వర్తమానంలోకి వచ్చి

"చిన్న చేపల్ని
పెద్ద చేపలు
సమాన ధర్మంగా
పల్లెల్ని పట్నాలు"

మింగేస్తున్నాయని ఆవేదన చెందుతాడు. ఖాళీగా ఉండి ఏంచేస్తాం, కాలక్షేపానికి టి.వి. చూద్దాం అనుకొనేవాళ్ళను

"బుల్లి తెరేనని
సరిపెట్టుకోకు
బుర్రలు
చెదగొడుతుంది"

అని సున్నితంగా మందలిస్తాడు.

ఆధునిక సాంకేతిక విజ్ఞానం మానవ అనుబంధాలను నాశనం చేస్తున్నాయని నిరూపిస్తూ

"మాటామంతీ
ఇంటర్నెట్ లోనే
మానవ అనుబంధాల
మాటేమిటి"

అని నిలదీస్తాడు.

ఈ నానీల శతకం (వంద నానీల సంపుటి)లో ప్రత్యేకించి ఇరవై నానీలు పల్లె గురించి, బాల్యం గురించి రాసినవే, అయితే మానవ అనుబంధాలు, ఆర్ద్రత, వర్తమాన సమాజం ప్రతిఫలించే నానీలూ ఇందులో ఉన్నాయి. ప్రముఖ కవి, సాహితీ విమర్శకులు ఎస్.ఆర్. భల్లం అన్నట్లు సోమేపల్లి వెంకటసుబ్బయ్య "వృత్తి మండల రెవెన్యూ అధికారి – ప్రవృత్తి నిరంతర కవితా ప్రపంచవిహారి". క్షణం తీరిక లేని ఉద్యోగంలో అప్పుడే ఆయన రెండు కవితా సంపుటాలు వెలువరించడం సామాన్యవిషయంకాదు.

"కాగితం
పడవలు సిద్ధం
వర్షం మాత్రం
ఎప్పుడొస్తుందో ఏమో"

అని ఆయనే అన్నట్లు, రెండు కవితా సంపుటాలు వెలువరించి మంచికవిగా సిద్ధమయ్యాడు సోమేపల్లి. ఆయన తదుపరి వచన కవితాసంపుటి "చల్లకవ్వం" ఎప్పుడొస్తుందో ఏమో అని సాహితీ ప్రియులు ఎదురుచూడగల్గేలా ఉండి, "తొలకరి చినుకులు" నానీల హృదయాన్ని 'ఉదయ్' బొమ్మలుగా గీయడం పుస్తకానికి ఎస్సెట్.

– ప్రతాప్ కుమార్ నేతల
విశాలాంధ్ర

పుటకు మూడు చొప్పున నానీలు, ప్రతిపుటలో రేఖాచిత్రంతో – 'తొలకరి చినుకులు' ఆర్ద్రత ఉన్న అందరికీ నచ్చే నానీల సంకలనం

– శరత్
[illegible]

తొలకరి చినుకుల్లో మొలిచిన నాణ్యమైన నానీలు

నానీలు తెలుగు కవిత్వంలో అత్యాధునిక కవితారూపంగా ప్రకాశిస్తున్న ప్రక్రియ. నానీలు అంటే నానీ, నీవీ, మనవి అని అర్థం. ఆధునిక సాహిత్యంలో ఈ నానీలు సరికొత్త ప్రక్రియ. తెలుగు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా॥ యస్. గోపీ ఆవిష్కరించిన, ప్రజాదరణ పొందిన ఈ నానీలు ఇటీవల అనేకమందికి స్ఫూర్తినిచ్చి కొత్త కొత్త ప్రమాణాలను అందిస్తున్నాయి. ఈ నానీలకు కొన్ని నియమనిబంధనలు డా॥ గోపీ ఏర్పరిచారు. ప్రతి నానీ 4 లైన్లు ఉండి 20 నుంచి 25 అక్షరాల వరకు ఉండాలి. మొదటి రెండు వాక్యాలను, రెండు చివరి వాక్యాలూ సమర్థించేవిగా గాని లేదా మొత్తం నాలుగు లైన్లు కలిసి ఒకే సందేశం ఇచ్చేవిగా ఉండాలి. 'చిట్టిపొట్టి మాటలను చిన్ని చట్రంలో పొందికగా బిగించి సమకాలీన భావజాలానికి అద్భుత అక్షరీకరణ నానీ' అని ప్రముఖకవి, సాహిత్య విమర్శకులు యస్.ఆర్. భల్లం అన్నారు. నానీలకు డా॥ గోపీ తరువాత 'గూడు వదలిన గువ్వలు' నానీల కవితా సంకలం ద్వారా యస్.ఆర్. భల్లం తమ అనుభూతులను చూపించారు. అటు పిమ్మట నానీలకు తృతీయ వారసులుగా 'లోయలో మనిషి' కవితా వచన సంపుటి రచయిత తణుకు మండల రెవెన్యూ అధికారి సోమేపల్లి వెంకట సుబ్బయ్య ఈ నెల 4వ తేదీన నానీల నాన్న డా॥ గోపీచే 'తొలకరి చినుకులు' నానీల పుస్తకావిష్కరణ జరిగింది. 'తొలకరి చినుకులు' నానీల ద్వారా పల్లెతనానికి, తల్లితనానికి ప్రతీకలేకాదు, సామాజిక స్పృహత్వానికి చక్కని ఉదాహరణ నిచ్చారు. సోమేపల్లి వారు తణుకు ఎమ్మార్వోగా ఊపిరిసలపని ఉద్యోగంలో ఉన్నా 'తొలకరి చినుకులు' నానీలతో పదును తేలిన భావాల్ని విత్తులా మొలిపించారు. ఈ నానీలో కోనసీమలో ఉన్నవారికి పట్టణంలోని కృత్రిమత్వాన్ని చూస్తే సీమ సౌందర్యం మరింత పెరుగుతుంది.

అదేం చిత్రమో
పట్నమొచ్చి
చూస్తేగాని
పల్లె సౌందర్యం తెలియలే!

హృదయాన్ని విలవిలలాడించే ఈ నానీ చూడండి.

పల్లె చెఱువులో
తల్లి చేప
పట్నం ఎక్వేరియంలో
పిల్ల చేప

కాసేపు
అంతటా నిశ్శబ్దం
శబ్ద కాలుష్యం
కొంత తగ్గిందిగా...!

ఈ నానీల వల్ల శబ్దకాలుష్యమే కాదు భావకాలుష్యం కూడా తగ్గుతుంది.

బూడిదంటే
చులకనెందుకు?
అది
జీవితపు తుది జాడ

కళ్ళు తెరిస్తే జననం,
కళ్లు మూస్తే మరణం
నడుమే జీవితం
ఆ జీవితపు తుది జాడ బూడిదేకదా!

జీవితాన్ని కాచి వడపోసినట్లు చెప్పారు.

బుల్లి తెరేనని
సరిపెట్టుకోకు
బుర్రలు
చెడగొడుతుంది

నిజమే... ధనాన్ని, కాలాన్ని, ఆరోగ్యాన్ని హరించే టి.వి. ఛానళ్ళను అనుక్షణం వీక్షించే ప్రేక్షకులకు చెంపపెట్టు ఈ నానీ

పల్లెదనం
చల్లని చద్దిబువ్వ
పట్నవాసం
వేడివేడి ఫాస్ట్‌ఫుడ్

పల్లెతనానికి, పట్నవాసానికి చక్కని విశ్లేషణ ఇచ్చారు.

ఇలా చెప్పుకుంటూపోతే ప్రతినానీ గురించి చెప్పాల్సిందే!

డా॥ గోపీ తెలుగు కవితావనంలోని నానీలకు నారుపోస్తే యస్.ఆర్. భల్లం నీరుపోస్తే, సోమేపల్లి వెంకట సుబ్బయ్య చక్కగా పండిస్తూ ఈ ప్రక్రియకు మరింత విస్తృతిని కల్పించారు. ప్రతి ఒక్కరూ చదివి నానీల రుచి, అనుభూతిని పొందవలసి ఉంది.

-మోటుపల్లి శ్రీనివాసరావు
న్యూస్‌వేవ్, తణుకు
విజేత

అనారోగ్యంగా ఉన్నప్పుడు కొన్ని మందులు వేసుకోగానే పనిచేస్తాయి. మరికొన్ని కొద్ది ఆలస్యంగా ఓ అరగంట తర్వాత కానీ పనిచేయవు. అలాగే కొన్ని చోట్ల సాహిత్యం చదవగానే అర్థమవుతుంది. మరికొన్ని చోట్ల చదివి కాసేపు ఆలోచిస్తే కాని అర్థమవదు. తుపాకి గొట్టం నుంచి పేలిన గుండులా చురుక్కున పాఠకుని మెదడులోకి దూసుకెళ్ళి చక్కని అనుభూతినిచ్చేవే ఈ 'తొలకరి చినుకులు' నానీలు.

ఆదివారం ఆంధ్రజ్యోతి

అలరించే చినుకులు

ఆచార్య ఎన్. గోపి సృష్టించిన నానీలు అనే కవితారూపం చాలా మందిని ఆకర్షిస్తోంది. చిట్టికవితలు అనే అర్థంలోను, నీవీ నావీ వెరసి మనవి అనే భావంలోనూ నానీలు పదం వాడబడింది.

ఇరవై-ఇరవై అయిదు అక్షరాలతో, నాలుగు పాదాలలో ఉండే నానీలులో స్వేచ్ఛగల నియతి ఉంది. మొదటి రెండు పాదాలు ఒక భావాంశంగా, తర్వాతి రెండు పాదాలు రెండో భావాంశంగా పేర్కొనవచ్చు. గోపి రాసిన నానీల ప్రభావంతో సోమేపల్లి వెంకటసుబ్బయ్య తొలకరి చినుకులు ప్రచురించారు. ఇవ్వాళ తెలుగు చదివిన వారికన్నా ఇతరులే ఎక్కువగా సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. రెవిన్యూ అధికారిగా ఉంటూ రెండవకవితా సంపుటి రాసినందుకు ముందుగా రచయితను అభినందించాలి.

పల్లె చెరువులో
తల్లిచేప
పట్నం ఎక్వేరియంలో
పిల్లచేప

అనే నానీకి భావవిస్తృతి ఉంది. పల్లె నుంచి పట్నాలకి వెళ్ళి తల్లిదండ్రుల్ని మరిచే షోకిల్లాలు గుర్తుకువస్తారు. ఈ కవికి పెల్లెపై ప్రేమ ఎక్కువ కాబట్టి నగరీకరణకి నిరసనగా కవితలు రాశారు.

బూడిదంటే
చులకనెందుకు?
అది
జీవితపు తుదిజాడ

అన్నప్పుడు తాత్త్వికత (పాతదే అయినా) క్లుప్తంగా పొదగబడింది.

పోయినోళ్ళందరూ
స్వర్గస్థులే అయితే
నరకం
చిరునామా?

అనటంలో చమత్కారంతో పాటు అధిక్షేపం ఉంది. ఈవిధంగా చాలా నానీలలో వ్యంగ్యం, చమత్కారం కనిపిస్తాయి. సామాజిక స్పృహ బాగా ఉంది. హైకూలకన్న నానీలు మిన్న అనటానికి ఈ సామాజికత, స్పష్టతలే కారణాలు. అయితే ఇందులో ఉన్న నానీలన్నీ ఓహో అనిపించవు. కొన్ని సాదాసీదాగానూ ఉంటాయి. కానీ – తలమునకలుగా ఉండే వృత్తిలో ఉన్న వ్యక్తి ఈమాత్రం కవితల్ని వెలువరించటం మెచ్చుకోదగినదే. ముందు ముందు అభ్యాసం ఎక్కువైతే, శిల్పం మీద శ్రద్ధ కనబరిస్తే మంచికవికాగలడని ఆశ.

– డాక్టర్ శాస్త్రి

ఆంధ్రప్రభ దినపత్రిక



లోయలో మనిషి

అక్టోబర్, 1997



తొలకరి చినుకులు

ఫిబ్రవరి, 2001

చల్లకవ్వం

ఏప్రిల్, 2002